ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | గురువారం | 17.09.2026 | సంపుటి : 2 | సంచిక : 75 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




## సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

**ఆస్తులు, ధరణి, భూభారతి వ్యవహారాలపై విచారణ జరిపించండి**

**సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉప నేత హరీశ్‌రావు సవాల్**

**డైవర్షన్ డ్రామాలతో ఎదురుదాడి.. దబాయింపులు, బెదిరింపులు**

**రేవంత్ కుటుంబం పేరిట 308ఎకరాలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం**

**22ఏ తప్పిదం అని ఒప్పుకున్నావ్.. బాధ్యులపై చర్యలు లేవు?**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 : 'నాతో పాటు మా పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలపై చేసిన ఆరోపణలన్నింటినీ నిరూపించండి. మా ఆస్తులు, మీ ఆస్తులు, మీ కుటుంబ సభ్యుల ఆస్తులు.. 2020 నుంచి ఇప్పటి వరకు ధరణి, భూభారతిలో జరిగిన వ్యవహారాలపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు మేం సిద్ధం. మీరు సిద్ధమా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉప నేత హరీశ్‌రావు సవాల్ విసిరారు. ప్రజా సమస్యలు, ఆరు గ్యారంటీల అమలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాము ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పే ధైర్యం లేకే సీఎం వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ డ్రామాలు చేస్తూ ప్రభుత్వ తప్పిదాలు ప్రశ్ని స్తున్న తమపై ఎదురుదాడి చేస్తున్నారని, దబాయింపులు, బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం

-మిగతా 2 లో..

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

## యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం

- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

> 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి

-మిగతా 2 లో..



**పాఠశాలలకు 13 రోజులు**

## దసరా సెలవులు

**అక్టోబర్ 10 నుంచి 22 వరకు సెలవులు**

**విద్యాశాఖ కీలక షెడ్యూల్ విడుదల**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 : తెలంగాణలో దసరా సెలవులపై విద్యాశాఖ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్‌ఏ-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను కూడా తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించనుండగా.. ఆ తర్వాత అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉండనున్నాయి. అంటే ఈసారి దసరా పండగకు వరుసగా 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి. తెలంగాణలోని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల

-మిగతా 2 లో..

# ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మరో గుడ్ న్యూస్

**గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం**

**హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ విపి గౌతమ్ వెల్లడి**

తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో అల్పదాయ వర్గాల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 20-07-2026 తేదీన జారీ చేసిన డిమాండ్ నోటిఫికేషన్ ద్వారా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం కల్పించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకొని, ప్రస్తుతం కింది నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నివసిస్తున్న అభ్యర్థులు తమ పాత దరఖాస్తును ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గానికి బదిలీ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు 1. ఎల్‌బీ నగర్, 2. గోషామహల్, 3. ముషీరాబాద్, 4. చాంద్రాయణగుట్ట అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని కింది లింక్ ద్వారా 20-09-2026లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని శ్రీ వి.పి. గౌతమ్ సూచించారు. అభ్యర్థి

-మిగతా 2 లో..



## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 16: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు

-మిగతా 2 లో..

## అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి

**నవంబరు 19న రాజీవ్ యువ వికాసం ప్రారంభం**

**తొలి విడతగా రూ.1 లక్ష ఆర్థికసాయం అందజేత**

**తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

**ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా**



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం తొలి విడతగా రూ.1 లక్ష వరకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నవంబరు 19 నుంచి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ప్రారంభించేలా అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో

-మిగతా 2 లో..



| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం**

- ఆయిల్‌పామ్‌కు ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు
- ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ

-మిగతా 2 లో..

## గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే..

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు**

**తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ**



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే

-మిగతా 2 లో..



## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి..

**చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 : సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన

-మిగతా 2 లో..

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే..

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మరో గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ చేయబడుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ మరియు నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని శ్రీ వి.పి. గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేయబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040–24603572ను సంప్రదించవచ్చు.

## 13 రోజులు దసరా సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణలో భాగంగా తరగతుల వారీగా వేర్వేరు సమయాలను విద్యాశాఖ కేటాయించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. తరగతుల వారీగా ఏ రోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష నిర్వహించనున్నారనే పూర్తి టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా తెలుసుకోవాలని విద్యాశాఖ సూచించింది. ఎస్ఏ–1 పరీక్షలు పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలోని పాఠశాలలకు సెలవులు ఉండనున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు లెక్కిస్తే మొత్తం 13 క్యాలెండర్ రోజులు సెలవులు రానున్నాయి. ఈసారి బతుకమ్మ, దసరా పండుగలు కూడా ఇదే సెలవుల సమయంలో రావడంతో విద్యార్థులకు వరుసగా సెలవులు లభించనున్నాయి. దసరా సెలవులకు ముందు ఎస్ఏ–1 పరీక్షలు ఉండటంతో విద్యార్థులు ముందుగానే ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది. పరీక్షల అనంతరం అక్టోబర్ 10వ తేదీ నుంచి సెలవులు ప్రారంభం కానున్నందున విద్యార్థులు తమ పాఠశాలల్లో అందించే పూర్తి టైమ్‌టేబుల్‌ను పరిశీలించి పరీక్షలకు సిద్ధం కావాల్సి ఉంటుంది. అక్టోబర్ 23వ తేదీ నుంచి పాఠశాలలు సాధారణంగా పునఃప్రారంభం కానున్నాయి. దీంతో తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ షెడ్యూల్ కీలకంగా మారింది.



## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి..

(మొదటిపేజీ తరువాయి)

వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో



తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ూూ పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ÷ూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ÷ూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట్టలో, గోద్రెజ్ ఆధ్వర్యంలో అంజనాపురంలో మిల్లులు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో ఆరు మిల్లుల నిర్మాణ పనులు కల్లూరుగూడెం, ఇంచెర్ల, పెద్దరాతు, రేగొండ/చిన్నపాక, యాచారం, శంకరంరెడ్డిపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాదికి ఇవి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రిఫైనరీ, ఆధునిక ప్యాకేజింగ్ కేంద్రం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. మిల్లుల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్న ప్రాంతాల్లో ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఒక ఫ్యాక్టరీ నిరంతరాయంగా పనిచేయాలంటే కనీసం 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట హార్వెస్టింగ్ దశకు రావాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటికే పలు ఫ్యాక్టరీలకు అనుమతులు ఇచ్చి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అన్ని ఉమ్మడి జిల్లాల్లో మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు,



భూపాలపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని, జనగామ, మహబూబాబాద్ ప్రాంతాల్లో కూడా ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్నందున అక్కడ అదనపు ప్రాసెసింగ్ సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరు నెలల్లో ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కనీసం 10--15 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించేలా రైతులను ప్రోత్సహిస్తే అక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ఆయిల్‌పామ్‌కు మార్కెటింగ్ సమస్య ఉండదని మంత్రి తెలిపారు. పంట కొనుగోలు కోసం ప్రాసెసింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కోతుల బెడద, అడవి జంతువుల వల్ల కలిగే ఇబ్బందులు కూడా ఆయిల్‌పామ్ సాగుతో తగ్గుతాయని చెప్పారు. ఆయిల్‌పామ్ పంట ఎగుమతులకు కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీలు, చిన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం వరకు సబ్సిడీలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మల్చింగ్, షేడ్‌నెట్, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర ఉద్యాన సదుపాయాలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసుకుని ఈ సంవత్సరం సుమారు రూ.1,000 కోట్లతో ఉద్యాన పంటల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఫామ్‌పాండ్ల ఏర్పాటుకు కూడా సబ్సిడీ అందిస్తున్నామని, ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఉచితంగా ఫామ్‌పాండ్లు తవ్వుకునే అవకాశం ఉందన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ పంట వరి తో పోలిస్తే తక్కువ నీరు అవసరమవుతుంది, మొక్క నాటిన తర్వాత సుమారు 40 సంవత్సరాల వరకు దిగుబడి అందించే అవకాశం ఉన్నందున రైతులు ఈ పంట వైపు దృష్టి సారించాలని మంత్రి కోరారు. జుక్కల్ నియోజకవర్గంలో బొప్పాయి మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కోరిన అంశంపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం అక్కడ సుమారు 36 ఎకరాల్లో మాత్రమే బొప్పాయి సాగు జరుగుతున్నందున తక్షణం ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేసే అవకాశం లేదని తెలిపారు. అయితే సాగు విస్తీర్ణం పెరిగి, మార్కెట్ అవసరం ఏర్పడితే తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను కూడా సోలార్ వ్యవస్థ వైపు మళ్లించి, భవిష్యత్తులో ఉద్యాన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన అని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌కు సమీప ప్రాంతాల్లో పండే ఉద్యాన పంటలను ఎగుమతి చేసే అవకాశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తరణతో రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయడం, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ఉద్యాన రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు ఆ పార్టీ నేతలపై బుధవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు ఖండిస్తూ.. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'నిషేధిత భూముల అంశంలో బీఆర్ఎస్ ఇన్నాళ్లుగా చెబుతోంది సీఎం మాటలే ధ్రువీకరించాయి. 3.71 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టామని, సమస్యను పరిష్కరించే క్రమంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి 30 లక్షల కుటుంబాలకు సమస్య ఏర్పడిందని సీఎం చెప్పడమే ఇందుకు నిదర్శనం. మేం ఇదే విషయాన్ని ఇన్నాళ్లు చెబుతున్నాం. ఇప్పుడు సీఎం స్వయంగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని ఒప్పుకున్నారు. మరి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన తప్పిదానికి బాధ్యత ఎవరిది? ఆదేశాలు ఇచ్చిన అధికారులపై, జాబితాను అప్‌లోడ్ చేసిన కలెక్టర్లపై చర్యలెందుకు లేవు? ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని చెప్పిన రెవెన్యూ మంత్రిపై చర్యలెందుకు తీసుకోలేదు? 22ఏపై తప్పు జరిగిందని ఒప్పుకున్న ప్రభుత్వం ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఎప్పటిలోగా సమస్యను పరిష్కరిస్తారో కాలపరిమితితో ప్రకటించాలి. కమిటీ వేస్తాం.. పరిశీలిస్తాం.. మార్గదర్శకాలు ఇస్తాం.. ఫీజులు కట్టించుకుంటాం.. అంటూ మాటలు చెబుతున్నారు. ప్రజలకు పరిష్కారం ఎప్పుడు ఇస్తారో చెప్పరు. ఎదురుదాడితో ప్రజల బాధ పోతుందా? సీఎంకు ఒక చట్టం.. సామాన్యుడికి మరో చట్టమా? మీ ఇల్లు నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టే రాష్ట్రంలోని ప్రతి సామాన్యుడి భూమికీ ఊరట కల్పించాలి..' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 'కేసీఆర్ ఎకరం కోసం, గజం కోసం ఆలోచించే వ్యక్తి కాదు. తెలంగాణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన ఉద్యమ నాయకుడు. ఆయనకు వెయ్యి ఎకరాలున్నాయని ఒకసారి.. ఇప్పుడు 60 ఎకరాలు ఉన్నాయని రేవంత్ పొంతన లేని లెక్కలు చెప్తున్నాడు. ఫామ్‌హౌస్, భూముల విషయంలో చేసిన ఆరోపణలన్నీ ఎన్నికల అఫిడవిట్లు, ఆదాయపు పన్ను రిటర్నుల్లో నేను వెల్లడించివే. నా భూములపై కలెక్టర్లు, సర్వేయర్లు, విజిలెన్స్, సీఐడీ, ఇంటెలిజెన్స్ వంటి విభాగాలతో విచారణలు జరిపించినా అక్రమాలు నిరూపించలేకపోయారు. నా భూములపై అనుమానం ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించు. నీ ఆస్తులు, నీ తమ్ముళ్ల ఆస్తులు, నీ కుటుంబ ఆస్తులపైనా అదే విచారణ జరుపుదాం. ఒక్క కొ్రలోనే మీ కుటుంబ సభ్యుల పేరిట 170 ఎకరాలు ఉన్నట్లు సమాచారం వచ్చింది. మీ కుటుంబ సభ్యుల పేరిట 308 ఎకరాలకు ఉన్నట్లు ప్రాథమిక వివరాలు అందాయి. ధరణి, భూభారతిలో బీఆర్ఎస్ హయాంలోనే కాదు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అవకతవక పైనా విచారణకు సిద్ధం. మేం చేసిన ఆరోపణలకు ఆధారాలు సభలో పెడతాం. సస్పెన్షన్ ఎత్తేస్తే అసెంబ్లీకి వచ్చి ఆధారాలతో మాట్లాడతాం. భూ భారతి చలాన్ల వ్యవహారం, ప్రజల ఆస్తులు ఇతరుల పేర్లకు మారిన లావాదేవీలు, నాదర్‌గుల్ భూముల అంశం.. ఇలా మేం లేవనెత్తిన ప్రతి ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి..' అని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడి బీఆర్ఎస్ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేశారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తమ వద్ద ఒక్క ఇంచు భూమి అక్రమంగా ఉన్నా నిరూపించాలని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలపై సీఎం చేసిన ఆరోపణలు సభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

## అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ పథకాల అమలు, గురుకులాల పనితీరు, స్కాలర్‌షిప్‌లు, మౌలిక వసతులు, స్టడీ సర్కిళ్ల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను నేరుగా గవర్నమెంట్ ఆఫీసుల్లోనే స్వీకరించాలని, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురుకుల స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్స్ ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. అలాగే గత పదేళ్లలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్, ఇతర సంక్షేమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే అవకాశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఆర్థిక స్వావలంబన చేకూర్చడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది.. సొంత కాళ్లపై నిలబడేలా చేయూత అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన శాశ్వత నివాసి అయి ఉండాలి. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత దీనికి అర్హులుగా భావిస్తారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ పరిమితికి లోబడి ఉండటంతో పాటు, వారి వయస్సు సాధారణంగా 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్పించాలి. ఆయా జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి, ఆర్థిక సాయాన్ని నేరుగా అందిస్తారు. మొదటిది రూ. 50 వేల స్కీమ్. ఇందులో లోన్ వంద శాతం రాయితీ ఉంటుంది. రెండోది రూ. 1 లక్ష స్కీమ్. ఇది వర్తించేవారికి వారికి 90శాతం రాయితీ ఉంటుంది. తర్వాత 2 లక్షల స్కీమ్, 3 లక్షల వరకు లబ్ది పొందే కేటగిరీ ఉంది. లక్ష నుంచి 3 లక్షల వరకు ఉన్న కేటగిరీలలో లబ్దిదారులు కొంత మొత్తం తిరిగి చెల్లించాలి. మిగతా మొత్తానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది.

జనం వార్త

గురువారం 17 సెప్టెంబర్ 2026



# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

**అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే**
**హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?**
**అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?**
**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి: కూనంనేని

**హైదరాబాద్:** కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

# ఉప్పు ఉత్పత్తికి నెలకొన్న సంక్షోభం!

## వాతావరణ మార్పులతో ఆటంకం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** వాతావరణ మార్పుల ప్రభావం దేశంలోని కీలక రంగాలపై తీవ్రంగా పడుతోంది. తాజాగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఉప్పు ఉత్పత్తిదారుగా ఉన్న భారత్‌లో ఈ సంక్షోభం స్పష్టంగా కనిపిస్తోంది. అకాల వర్షాలు, తరచూ సంభవిస్తున్న తుపానులు, రుతుపవనాల తీరులో మార్పులు వంటి కారణాలతో ఉప్పు ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా దేశంలోనే అత్యధికంగా ఉప్పును ఉత్పత్తి చేసే గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లోని ఉప్పు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. భారత్‌లో ఏటా సగటున 30.7 మిలియన్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఇందులో సింహభాగం, అంటే దాదాపు 85 నుంచి 87 శాతం గుజరాత్ నుంచే వస్తుంది. సంప్రదాయబద్ధంగా సముద్రపు నీటిని గానీ, భూగర్భంలోని ఉప్పునీటిని గానీ విశాలమైన మడుల్లోకి (ప్యాన్‌లు) పంపి, సూర్యరశ్మికి ఆవిరయ్యేలా చేయడం ద్వారా ఉప్పును తయారు చేస్తారు. ఈ ప్రక్రియకు సుదీర్ఘమైన పొడి వాతావరణం, తగినంత సూర్యరశ్మి అవసరం. వర్షపాతం వీలైనంత తక్కువగా ఉండాలి. కానీ, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ప్రక్రియకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లోని కచ్ ఎడారి ప్రాంతం, తమిళనాడులోని తూత్తుకుడి, మరక్కాణం వంటి తీరప్రాంతాల్లోని ఉప్పు క్షేత్రాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. అకాల వర్షాలు కురవడం వల్ల మడుల్లోని ఉప్పునీటి గాఢత తగ్గిపోతోంది. దీంతో నీరు ఆవిరయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొన్నిసార్లు, తయారైన ఉప్పు స్ఫటికాలు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి కాలం తగ్గిపోవడమే కాకుండా, దిగుబడి కూడా గణనీయంగా పడిపోతోంది. గుజరాత్‌లో రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభం కావడం లేదా ఎక్కువ కాలం కురవడం వల్ల ఉప్పు తయారీ సీజన్ ఆలస్యమవుతోంది. తమిళనాడులోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో, కొన్నిసార్లు అక్కడి వ్యాపారులు గుజరాత్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. లిటిల్ రాణ్ ఆఫ్ కచ్‌లోని ఉప్పు రైతులపై 2026లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. మారుతున్న వర్షపాత సరళి, విపరీతమైన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయని తేలింది. ఉష్ణోగ్రతలలో మార్పులు కూడా నీరు ఆవిరయ్యే వేగాన్ని, స్ఫటికాల ఏర్పాటును ప్రభావితం చేస్తున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. తీర ప్రాంతాల్లో తుపానులు, బలమైన గాలులు మరో పెను సవాలుగా మారాయి. రైతులు తమ మడుల చుట్టూ గట్లు నిర్మించుకుని రక్షణ చర్యలు తీసుకుంటున్నా, అవి పెద్ద వర్షాలు, వరదల ముందు నిలవలేకపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పరిశోధనా సంస్థలు ప్రత్యామ్నాయ టెక్నాలజీలపై దృష్టి సారించాయి. ప్రతికూల వాతావరణంలోనూ నీటిని వేగంగా ఆవిరి చేసే పద్ధతులపై ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే, ఈ టెక్నాలజీలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశీయ ఉప్పు ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థ ను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తి గత ప్రయోజనాల ఆధారంగా కాకుం డా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందు కు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.



# దానం అనర్హతపై విచారణ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటంపైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారిం ది. ఈ పిటీషన్‌ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయి దా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాం గ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయ వాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరిం చిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతు న్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాద నలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎ స్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథ మిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయిన ట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయ-బోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# భార్య ముక్కు కొరికేసిన భర్త...

## మంచిర్యాలలో దారుణ ఘటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం

### భారత్‌తో భారీ డీల్ కుదుర్చుకున్న న్యూజిలాండ్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

# కోటి ఎకరాలు కాదు.. కేవలం 3.60 లక్షల ఎకరాలే

## నిషేధిత జాబితాపై విపక్షాల తప్పుడు లెక్కలు

**22ఏపై బీఆర్ఎస్ అసత్యాలు మాట్లాడుతోంది**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా కొందరు నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి పాలకులు చేసిన చారిత్రక తప్పిదాలను ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సరిదిద్దుతుంటే ఓర్వలేక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాస్తవానికి హైకోర్టు ఆదేశాలు, తీవ్రమైన న్యాయపరమైన వివాదాలు ఉన్న కేవలం 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచినట్లు స్పష్టం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దుతోందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభకు హాజరుకాకుండా 'మాక్ అసెంబ్లీ'ల పేరుతో నాటకాలు ఆడటం బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సభాపతిని, దళిత వర్గాలను, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అవమానిస్తూ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ధరణి అడ్డం పెట్టుకుని జరిగిన భూ దారుణాలను త్వరలోనే ఆధారాలతో సహా అసెంబ్లీ వేదికగా బట్టబయలు చేస్తామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్

- పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాం
- సింగపూర్ ప్రతినిధులతో సీఎం కీలక భేటీ
- సుముఖత వ్యక్తం చేసిన సింగపూర్ బృందం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలి దశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.



# సిఎం, టీపీసీసీ మధ్య అత్యుత్తమ సమన్వయం

- ఆ ఇద్దరూ మళ్లీ పార్టీని అధికారంలోకి తెస్తారు
- శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

జనం వార్త

# ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి



**ప్రపంచవ్యాప్తంగా నేడు జరుగుతున్న యుద్ధాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ యుద్ధాలవల్ల ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం లోకి నెట్టింది. నేడు పలు దేశాల మధ్య యుద్ధాల వల్ల అన్ని దేశాలలో నిత్యావసర ధరలు ఎగిసిపడుతున్నాయి. వాస్తవానికి యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది.**

దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా–ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది. కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘనిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, "వసుధైవ కుటుంబకం" భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించాలి.

మరోవైపు పశ్చిమాసియాలో ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది.సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్‌కు, బడ్జెట్, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా "ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా" అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఇరాన్?తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. అవి ఏమిటంటే రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఆర్కొట్? ఖర్చులు (ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం); సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు; దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు. "అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్? నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్? డాలర్లు (సుమారు రూ.19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం" అని సీబీఓ పేర్కొంది.

జూన్‌లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్?తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం.క్షిపణి రక్షణ వ్యవస్థల వాడకం భారీగా పెరగడం వల్ల అమెరికా వద్ద మిస్సైల్స్? నిల్వలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని సీబీఓ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సైన్యానికి ఇది ఇబ్బందికర పరిణామమేనని స్పష్టం చేసింది. ఇరాన్? వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మూజ్? జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్?, డీజిల్, జెట్ ఫ్యూయెల్? ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. అయితే దౌత్యపరమైన చర్యలు, విదేశీ సహాయానికి అయ్యే అదనపు ఖర్చులను ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని, అది యుద్ధ ముగింపుపై ఆధారపడి ఉంటుందని సీబీఓ పేర్కొంది. ఏదేమైనా ఈ యుద్ధాలు త్వరగా ముగిసిపోతే తప్ప ప్రజలకు కాస్త ఉపశమనం లభించదు. ఆ దిశగా ప్రపంచ దేశాలు చొరవ తీసుకొని యుద్ధాలు జరిగే దేశాల మధ్య సంధి కుదిర్చి మరింత ఆర్థిక సంకోభంలోకి వెళ్ళకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తిరుమలలో ఉచిత ఈవీ బస్సుల సేవలు ప్రారంభం

**అమరావతి, సెప్టెంబర్ 16 :** తిరుమల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను అందించేందుకు సిద్ధం చేసిన ఉచిత ఈవీ బస్సుల సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల శుభసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమలలో ఘనంగా ప్రారంభించారు. పర్యావరణహిత రవాణా కోసం రిలయన్స్ సంస్థ 25 ఎలక్ట్రిక్ బస్సులను అందించగా, బయోటెక్ సంస్థ 7 బస్సులను టీటీడీకి ఉచితంగా అందజేసింది. బస్సులతో పాటుగా 'జియో–బీపీ' సహకారంతో ప్రత్యేక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గత జూన్ నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, తిరుమల కొండపై కాలుష్యాన్ని తగ్గించేందుకు టీటీడీకి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా 25 ఈవీ బస్సులను విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బస్సులు కొండపైకి చేరుకుని నేడు భక్తుల సేవలకు అందుబాటులోకి వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది



మంది భక్తులకు మాడ వీధులు, కాటేజీలు మరియు దర్శన క్యూలైన్ల వద్దకు ఉచితంగా చేరుకోవడానికి ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

## సౌదీకి హుతీల మరో భారీ షాక్

### అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** పశ్చిమాసియాలో సౌదీ అరేబియా–హుతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హుతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్–మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్థంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్–15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

### కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50–55 కోట్లకు చేరిందని తెలిపారు.

## చంద్రబాబు హయాంలో 'రెడ్ బుక్ పాలన'

- "రెడ్ బుక్ పాలన" అంతర్జాతీయ స్థాయికి చేరింది
- ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు మారింది
- రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం మోసం?
- రాష్ట్రం, దేశం యొక్క ప్రతిష్టను దిగజార్చేలా ఉంది
- ఎక్స్ వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్



**అమరావతి, సెప్టెంబర్ 16 :** ఏపీలో ఈ మధ్య సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నేతల పోస్టుల్ని పోలీసులు ఆయా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ కు మెయిల్స్ పెట్టి బ్లాక్ చేయిస్తున్నారు. ఇదే క్రమంలో తాజాగా వైసీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పెట్టిన ఓ పోస్టును కూడా ఇలాగే పోలీసులు ఎక్స్ కు మెయిల్ పెట్టి బ్లాక్ చేయించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఈ మెయిల్ లో వారు తమను తాము అమెరికా ఫెడరల్ దర్యాప్తు సంస్థ గా అభివర్ణించుకున్నారు. దీనిపై వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఇవాళ ఎక్స్ లో ట్వీట్ చేశారు. చంద్రబాబు హయాంలో "రెడ్ బుక్ పాలన" అంతర్జాతీయ స్థాయికి చేరిందని, ఇప్పుడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ పోలీసులే ఎఫ్బీఐగా అవతారం ఎత్తారని, ఇది నకిలీ గుర్తింపు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు కూడా అని జగన్ విమర్శించారు. చంద్రబాబు గారూ, ఇది నిజమైన పోలీసింగ్ విధానమా లేక రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం చేస్తున్న మోసమా? అని ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా ఉన్న పోస్టులను తొలగించాలని కోరేటప్పుడు, మీ పోలీసు యంత్రాంగం తమను తాము అమెరికాకు చెందిన 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' గా చెప్పుకోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇది మన రాష్ట్రం, దేశం యొక్క ప్రతిష్టను దిగజార్చేలా ఉందన్నారు. పోస్టులను తొలగించాలన్న అభ్యర్థన ఖీఎఫ్బీఐ నుండి కాకుండా, అధికారిక ఆంధ్రప్రదేశ్ పోలీసు ఈమెయిల్ అడ్రస్ నుండే వచ్చిందని ఎక్స్ ధృవీకరించిందని పేర్కొన్నారు. అయినా ఆ అధికారి పంపిన సంస్థ పేరుగా ఎఫ్బీఐని పేర్కొన్నారన్నారు. ఈ తొలగింపు అభ్యర్థనను ఎవరు ఆదేశించారు? ఎఫ్బీఐ గుర్తింపును ఎందుకు దుర్వినియోగం చేశారు? మీ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తున్న గొంతులను అణచివేయడానికి ఎక్స్ సంస్థను తప్పుదోవ పట్టించడానికి ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమా? అని ప్రశ్నించారు. నెరవేరని 'సూపర్ సిక్స్', 'సూపర్ సెవెన్' హామీలు, డీఎస్సీ స్కాం, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలు , వేధింపులు వంటి అంశాలే ఇందుకు కారణమన్నారు. పోలీసు యూనిఫాం అనేది చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించినదని, మీ రాజకీయ సెన్సార్‌షిప్‌ను అమలు చేయడానికి కాదని జగన్ గుర్తుచేశారు. రాజకీయ కారణాలతో పోస్టులను తొలగించే చర్యలో విదేశీ దర్యాప్తు సంస్థ పేరును లాగడం ఆంధ్రప్రదేశ్ పరువు తీయడమే కాకుండా, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. విమర్శకుల గొంతు నొక్కడానికి వెచ్చిస్తున్న శక్తిని, 'సూపర్ సిక్స్', 'సూపర్ సెవెన్' హామీలను నెరవేర్చడానికి ఉపయోగించాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవడం, నిజమైన ఉద్యోగాలను కల్పించడం, అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు నిజంగా అవసరమైన సమస్యలను పరిష్కరించడం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియా కాలంలో, కట్టుకథలు లేదా తప్పుడు ప్రచారాల వెనుక దాక్కోవడం అసాధ్యమన్నారు. ఈ ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్, వేధింపులతో కాకుండా, సమర్థవంతమైన పనితీరు , పారదర్శకతతో సమాధానం ఇవ్వాలని జగన్ సూచించారు.

## నేడు వారణాసికి సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 16 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (సెప్టెంబరు 17) వారణాసిలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాశీలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి గా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలకు గుర్తుగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నా రు. ఇందులో భాగంగా ప్రధాని రాజకీయ జీవితంతో ముడిపడిన వారణాసి, ఆయన స్వస్థలం వాద్‌నగర్‌ను కలుపుతూ 'వారణాసి––వాద్‌నగర్ సేవా యాత్ర'ను చేపట్టారు. యువత, ప్రజాప్రతిని ధులు, సేవా సంస్థల భాగస్వామ్యంతో జరిగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని సేవా యాత్రను ఫ్లాగ్ ఆఫ్ చేస్తారు. దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 7:30 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటలకు శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకుంటారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:10 గంటలకు వారణాసి నుంచి తిరుగుపయనమై సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో మరణశిక్ష

### 10 మంది మావోయిస్టులకు శిక్ష విధిస్తూ తీర్పు

**బస్తర్, సెప్టెంబర్ 16 :** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పిటిషన్లకు విచారణార్హత లేదు

### వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు వెల్లడి

**అమరావతి, సెప్టెంబర్ 16 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే సంక్షేమ డ్రామా
- వైసీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 16 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు. అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు.

## రేపల్లె నేత మోపిదేవి శ్రీనివాసరావు సస్పెండ్

### గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపణ

**అమరావతి, సెప్టెంబర్ 16 :** రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు నెలల క్రితమే (గత మే నెలలో) శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీని వీడి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అత్యల్ప కాలంలోనే సస్పెన్షన్ వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీనివాసరావు ఓటమిపాలయ్యారు. అయితే, వైసీపీలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక వైసీపీలో సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గం లో ప్రచారం చేసుకోవడంపై స్థానిక కేడర్ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరొకవైపు వర్గపోరు ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం..




**దుబ్బాక, సెప్టెంబర్ 16 (జనం వార్త) :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు అలసత్వం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండో సర్వసభ్య సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మూడు నెలలకోసారి జరిగే కీలక సమావేశానికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈవో నీరజతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పౌష్టికాహార పంపిణీపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవితో కలిసి సమీక్షించారు. గృహనిర్మాణ శాఖ సమీక్షలో భాగంగా మండలానికి మంజూరైన 104 ఇళ్లలో 50 ఇళ్ల నిర్మాణాలు పూ-ర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల సహకారంతోనే అభివృద్ధి పనులు సమర్థవంతంగా ముందుకు సాగుతాయని పేర్కొంటూ, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా దోమలు, ఈగల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ యువత, రైతాంగం సరికొత్త ఉపాధి మార్గాలు, ఆధునిక వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పట్టణాల్లో క్లౌడ్ కిచెన్‌ల ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో వంట నైపుణ్యం ఉన్నవారు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన పాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున పాడి పరిశ్రమతో పాటు బయోగ్యాస్, ఇథనాల్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని అన్నారు. భవిష్యత్తులో మొక్కజొన్న కీలక వాణిజ్య పంటగా మారే అవకాశం ఉందని, మొక్కజొన్న వ్యర్థాలతో బయో-ప్లాస్టిక్ ఉత్పత్తులు, పేపర్లు, బాటిళ్లు, ప్లేట్లు తదితర వస్తువుల తయారీతో పాటు ఇథనాల్ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రకృతి వనరులు, వర్షపు నీటిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే కాలంలో సాంకేతిక, ఆర్థిక రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకోనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలు కూడా అందుకు అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, ఎస్సై చైతన్యకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

### మహిళ కడుపులో నుంచి 5 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డ తొలగింపు



**దుబ్బాక సెప్టెంబర్ 16 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద మరో అరుదైన ఆపరేషన్ చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. కామారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన 43 సంవత్సరాల రాణి అనే మహిళ గత కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి రాగా, డాక్టర్ హేమారాజ్ సింగ్ ఆమెకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మహిళ గర్భాశయంలో పెద్ద ఫైబ్రాయిడ్ గడ్డ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న వైద్య బృందం వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. డాక్టర్ హేమారాజ్ సింగ్ నేతృత్వంలో మత్తు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది కలిసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసి, మహిళ కడుపులో నుంచి సుమారు 5 కిలోల 2 గ్రాముల బరువున్న భారీ ఫైబ్రాయిడ్ గడ్డను బయటకు తీశారు. ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇలాంటి సంక్లిష్టమైన ఆపరేషన్లను ఉచితంగా అందిస్తున్నామని, ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేద మహిళకు పునర్జన్మ ప్రసాదించి, అత్యంత ప్రతిభావంతంగా ఆపరేషన్ పూర్తి చేసిన వైద్యులకు, సహకరించిన సిబ్బందికి పేషెంట్ కుటుంబ సభ్యులు మరియు బంధువులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## జడ్చర్లలో ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియపై సమీక్ష



**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (జనం వార్త):** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జడ్చర్ల మండలం, పట్టణంలో ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియ పనితీరును సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర సమన్వయకర్త, టీపీసీసీ ఎస్ఐఆర్ కార్యక్రమం జడ్చర్ల నియోజకవర్గ సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డిడి జాబితా, అసాధారణతల జాబితా, ఓటరు నోటీసులకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించా ల్సిన మార్గాలను సూచించారు. ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, ఉప తహసీల్దార్, మండల అధ్యక్షులు గోపాల్, పట్టణ అధ్యక్షులు వంశీ, గ్రామ పంచాయతీ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : కొమిరెల్లి

**నాగారం,సెప్టెంబర్ 16 (జనం వార్త) :** గణనాథుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెల్లి సుధాకర్ రెడ్డి అన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నాగారం డివిజన్ పరిధి లోని విజయపురి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని కొమిరెల్లి సుధాకర్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండప నిర్వహకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించార. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యంరాజు, చెంది శ్రీనివాస్,కటికల యాదయ్య, సోమరాజు, నాగచారి,ప్రభాకర్ రెడ్డి, యాదయ్య,జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి : ఎస్సై గోపి



**కారేపల్లి :** ప్రజలకు ఏ సమస్య ఎదురైనా నేరుగా పోలీసులను సంప్రదించాలని కారేపల్లి ఎస్సై బి. గోపి సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిం చి, సమస్యల పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు. ప్రజ లకు ఎల్లప్పుడూ పోలీసుల సహకారం, భరోసా ఉంటుం దని పేర్కొన్నారు. మండలం లో గణేష్ నవరాత్రి వేడుకలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని ఎస్సై కోరారు. గణేష్ మండపాల వద్ద భక్తిశ్రద్ధలకు ప్రాధా న్యత ఇస్తూ భక్తి గీతాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమాలను సైతం క్రమబద్ధంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, ఇతరులకు ఇబ్బందులు కలిగించడం, మహిళలను కించపరిచేలా ప్రవర్తించడం వంటి చర్యలను సహించబోమని ఎస్సై బి. గోపి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ నవరాత్రి వేడుకలు భక్తి, శాంతి, సోదరభావంతో కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

### పేరుకే ప్రభుత్వ దావఖాన...

# తీరని పేదల కష్టాలు!



**దుబ్బాక, సెప్టెంబర్ 16 (జనం వార్త) :** "నేను వస్తా బిడ్డో... సర్కారు దావఖానకు" అన్న మాటలు పోయి, నేడు " అమ్మో... నేను రాను బిడ్డో సర్కారు దావఖానకు" అనే పరిస్థితికి చేరుకుంది మిరుదొడ్డి ప్రభుత్వ ఆసుపత్రి తీరు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోనే అత్యంత కీలకమైన మిరుదొడ్డి మండలం లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు అలంకారప్రాయంగా మారింది. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా, అత్యవసర చికిత్స కావాలన్నా ప్రజలు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేటకు పరుగులు తీయాల్సి వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ, సరైన వసతులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఆసుపత్రి సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదు. గ్రామీణ ప్రాంతమైన మిరుదొడ్డి మండలంలో రాత్రివేళల్లో ఎవరైనా పాము లేదా తేలు కాటుకు గురైతే తక్షణమే చికిత్స అందించే నాథుడే కరువయ్యాడు. రాత్రి సమయాల్లో ఆసుపత్రి మూసివేసి ఉండటంతో, విష ప్రభావం ఒంటికి పాకే లోపే బాధితులను సిద్దిపేటకు తరలించాల్సి వస్తోంది. ఈ ప్రయాణంలో సమయం వృథా అయి ఎంతోమంది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గర్భిణీ స్త్రీల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. సాధారణ ప్రసవాలు జరగాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి వేళల్లో సేవలు నిలిచిపోవడంతో ప్రసవ సమయాల్లో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విధిలేక వేలాది రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లక ముందే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే 24 గంటల ఆసుపత్రిగా ప్రకటించి, ఎదుర్కొంటున్న సిబ్బంది కొరతను తీర్చాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సమయంలో రోగికి తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడేలా, ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

## ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ

- రూ.26వేల కోట్ల విలువైన ఆయుధాలు సరఫరా!
- 40వేల అత్యంత శక్తిమంతమైన భారీ బాంబులు
- ఇజ్రాయెల్‌తో అమెరికా రహస్య సమావేశం!
- ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** పశ్చిమాసియాలో ఇరాన్- అమెరికా ఘ-ర్షణ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్‌కు 2.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.26 వేల కోట్లు) ఆయుధ ప్యాకేజీని అమెరికా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయుధ ప్యాకేజీలో ఒక్కొక్కటి 900కిలోల బరువున్న 40,000 బాంబులు ఉండనున్నట్లు సమాచారం. ప్రతిపాదిత ప్యాకేజీలో 20,000 వీఖ-84 బాంబులు, 20,000 దీూఖ-117 బాంబులతో పాటు 20 వేలు ×-2000 పెనెట్రేటర్ వార్‌హెడ్‌లు ఉండనున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇజ్రాయెల్‌కు అమెరికా ఇంత భారీ మొత్తంలో ఆయుధాలను ఒకేసారి విక్రయించడం ఇదే అయి ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులకు ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్ కోసం 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. దీనికి యూఎస్ ఫారిన్ మిలిటరీ ఫైనాన్సింగ్ ప్రోగ్రామ్ ద్వారా నిధులు సమకూర్చనున్నారు. ఈ కార్యక్రమం కింద అమెరికన్ ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఇజ్రాయెల్‌కు నిధులను వాషింగ్టన్ అందిస్తుంది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గత జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ప్యాకేజీని దాటేసింది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గురించి అమెరికా కాంగ్రెస్‌లోని సంబంధిత కమిటీలకు అనధికారికంగా సమాచారం అందింది. యూఎస్ సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ, అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీని ట్రంప్ ప్రభుత్వం సంప్రదించిందని అమెరికా మీడియా తన కథనంలో పేర్కొంది. 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీకి ఆమోదం తెలపాలని ఆ కమిటీలను కోరుతోందని స్పష్టం చేసింది. చరిత్రాత్మకంగా ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలకు ఉభయపక్షాలు మద్దతు ఇచ్చాయని వెల్లడించింది. అయితే గాజా, ఇరాన్‌లోని సంఘర్షణల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మద్దతు ఇవ్వడంపై కొంతమంది చట్టసభ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారని చెప్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సాయంపై వాషింగ్టన్‌లో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ సిద్ధం అయ్యిందని తెలిపింది. ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ సహాయాన్ని నిలిపివేయడానికి మద్దతుగా ఈ ఏడాది జులైలో వంద మందికి పైగా డెమొక్రాట్లు ఓటు వేశారని నివేదించింది. అయినప్పటికీ రిపబ్లికన్ చట్టసభ సభ్యులు ఇజ్రాయెల్‌కు విస్తృతంగా మద్దతు ఇస్తూనే ఉన్నారని చెప్పింది. కాగా, అమెరికా ఆయుధాగారంలో ఉన్న అత్యంత విధ్వంసకరమైన బాంబుల్లో ఎంకే-84 ఒకటి. ఇది పేలిందంటే పెద్ద లోహపు శకలాలు వేలాది అడుగుల దూరంలో ఎగిరిపడే అవకాశం ఉంది. అలాగే ఈ బాంబు దృఢమైన నిర్మాణాలను సైతం పేల్చేయగలదు. ఇజ్రాయెల్ ఈ తరహా బాంబులను లెబనాన్, గాజాలో గతంలో పలు సార్లు ప్రయోగించింది. దాంతో అప్పట్లో బైడెన్ ప్రభుత్వం వాటి డెలివరీని నిలిపిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే డొనాల్డ్ ట్రంప్ రెండో సారి 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిలుపుదలను ఎత్తివేశారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి భారీ బాంబులను ఉపయోగించడం వల్ల పౌరుల ప్రాణాలకు తీవ్ర నష్టం జరుగుతుందని మానవ హక్కుల సంఘాలు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశాయి. అయినా ట్రంప్ వెనక్కి తగ్గలేదు. అయితే గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ సైనిక చర్యల నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ప్యాకేజీ సిద్ధమవ్వడం గమనార్హం. కాగా, ఇజ్రాయెల్ రక్షణ అవసరాలకు అమెరికా మొదటి నుంచి అండగా ఉంటోంది. కాగా.. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఏడు అరబ్ దేశాలకు చెందిన అత్యున్నత స్థాయి సైనికాధికారులు జర్మనీలో రహస్యంగా సమావేశమయ్యారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, ప్రాంతీయ భద్రత, హూతీల దాడులు, హర్మూజ్ జలసంధి పరిస్థితులపై ఈ భేటీలో చర్చించినట్లు అని ఆక్సియోస్ నివేదిక వెల్లడించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఈజిప్ట్‌కు చెందిన సైనికాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఆయా ప్రభుత్వాలు ముందుగా ఈ సమావేశాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కానీ జర్మనీలో ఎనిమిది దేశాల సీనియర్ సైనికాధికారులతో షెడ్యూల్ ప్రకారం సమావేశం నిర్వహించినట్లు సెంట్?కామ్ ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడమే సమావేశం ఉద్దేశమని తెలిపింది. ఇరాన్? నుంచి అమెరికా సైనిక స్థావరాలపై దాడులు కొనసాగుతున్నప్పటికీ, పశ్చిమాసియా నుంచి తమ బలగాలను ఉపసంహరించుకునే ఆలోచన లేదని బ్రాడ్? కూపర్ భేటీలో చెప్పినట్లు ఆక్సియోస్ కథనం వెల్లడించింది. అలాగే హర్మూజ్ జలసంధి మీదుగా వాణిజ్య నౌకల రాకపోలకు మరింత పెంచేందుకు అమెరికా అనుసరిస్తున్న వ్యూహాల గురించి ఆయన వివరించినట్లు తెలిపింది. అదే సమయంలో వివిధ ప్రాంతాల్లో కొనసాగాతున్న ఇజ్రాయెల్ సైనిక చర్యల గురించి ఐడీఎఫ్? చీఫ్? ఆఫ్? స్టాఫ్? జనరల్ ఎయాల్ జమీర్ వివరించినట్లు పేర్కొన్నాయి. ఇరాన్ యుద్ధంతో పాటు యెమెన్‌కు చెందిన హూతీల కార్యకలాపాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. సౌదీ అరేబియాపై హూతీల దాడులు పెరగడంతోపాటు బాబ్ అల్-మందెబ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి.




## కన్నతల్లిని కడతేర్చిన కసాయి కొడుకు

### కోడలితో కలిసి వృద్ధురాలి దారుణ హత్య

- సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
- గాయాలు పట్టించిన గుట్టు.. మృతదేహం పోస్టుమార్టానికి తరలింపు
- పోస్టుమార్టం భయంతో సర్పంచ్ ఎదుట దంపతుల లొంగుబాటు
- నిందితుల అరెస్ట్.. జనగామ కోర్టులో రిమాండ్

**దేవరుప్పుల :** కనిపెంచిన తల్లిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కొడుకే కాలయముడయ్యాడు. ఆస్తిపాస్తులు కాదు కదా.. కనీసం ఆత్మీయతను పంచాల్సిన ఆ ఇంటి కోడలు రాక్షసిగా మారింది. వృద్ధాప్యంలో తమ వద్దకు ఆశ్రయం కోసం వచ్చిన కన్నతల్లిని.. భార్యాభర్తలిద్దరూ కలిసి కిరాతకంగా కొట్టి చంపారు. ఆపై ఏమీ ఎరుగనట్లు అనారోగ్యంతో మృతి చెందిందని నమ్మించే ప్రయత్నం చేసి పోలీసులకు అడ్డంగా బుక్కయ్యారు. దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో వెలుగుచూసిన ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడవెండి గ్రామానికి చెందిన పెందొట వెంకటేశ్వర్లు వయసు(54) వృత్తిరీత్యా స్వర్ణకారుడు (గోల్డ్ వర్క్). సుమారు నాలుగు నెలల క్రితం అతడి తల్లి ఉపేంద్ర తన కుమారుడి వద్ద ఉండేందుకు వచ్చింది. అయితే, గత కొంతకాలంగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అత్తాకోడళ్ల మధ్య, తల్లికొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే ఈ నెల 8వ తేదీ (08.09.2026) రాత్రి కుటుంబంలో మరోసారి వివాదం చెలరేగింది. దీంతో ఆగ్రహానికి గురైన వెంకటేశ్వర్లు, అతడి భార్య వనిత వయసు (31) కలిసి వృద్ధురాలిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

**గాయాలతో బయటపడ్డ బండారం..** తల్లి మృతి చెందగానే గుట్టుచప్పుడు కాకుండా.. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతోనే ఆమె మృతి చెందిందని బంధువులకు, చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. మరుసటి రోజు ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే, మృతదేహాన్ని పరిశీలించిన బంధువులకు వృద్ధురాలి శరీరంపై బలమైన గాయాలు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### భయంతో సర్పంచ్ ఎదుట లొంగుబాటు..

పోస్టుమార్టం నివేదిక వస్తే అసలు నిజం బయటపడుతుందని భయాందోళనకు గురైన నిందితులు వెంకటేశ్వర్లు, వనిత.. నేరుగా కడవెండి గ్రామ సర్పంచ్ బషిపాక రాములును ఆశ్రయించారు. క్షణికావేశంలో తామే ఈ హత్య చేశామని అతడి ఎదుట నేరాన్ని అంగీకరించారు. దీంతో సర్పంచ్ వెంటనే ఆ దంపతులిద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీసులకు అప్పగించారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని పూర్తిగా అంగీకరించారని పోలీసులు వెల్లడించారు. పాలకుర్తి సీఐ భరత్ సుమన్ ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం జనగామ కోర్టులో హాజరుపరిచారు. వృద్ధురాలి వయసుకు సంబంధించిన అధికారిక ఆధారాలను దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ పోలీస్ సిబ్బందిని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారగొని శ్రీనివాస్ గౌడ్

**వలిగొండ :** ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగొని శ్రీనివాస్ గౌడ్ ను నియమించారు. బుధవారం భువనగిరి లో ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ను ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించిన అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్యక్షునిగా కొలను శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారగొని శ్రీనివాస్ గౌడ్ ను, జిల్లా సలహాదారులుగా బొడిగే సుదర్శన్,నారగోని అంజయ్య,భువనగిరి ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా రత్నపురం శ్రీనివాస్ ల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బట్టు రామచంద్రయ్య, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగుఅంజన్న, దుగ్యాల శ్యామల, జగన్, చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేణి స్వామి పాల్గొన్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం... జనం కోసం...



## విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు
- నేడు 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో ఉద్యోగ నియామకాలు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ, సెప్టెంబర్ 16 :** రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియామకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్ఆఫ్ తేదీని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 629 ఏఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించాం త్వరలో ఫలితాలు అందిస్తామని, విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు. త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మూడు డిఏ లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎలక్ట్రిసిటీ విభాగం పనిచేస్తోందన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడమే దీని ఉద్దేశమన్నారు.

### గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా సుమారు 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా సుమారు రూ. 10,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఉ హెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి దశలోనూ.. రోగి భద్రత

- ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు..
- 'సంజీవని'తో నిరంతర వైద్యం
- మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం
- సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం
- మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి, సెప్టెంబర్ 16 :** రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా.. 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా 'సంజీవని' ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. 'సంజీవని' ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరినీత పెరుగుతుందని చెప్పారు. రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

# ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల అభివృద్ధి

- భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్
- తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం
- సీఎం చంద్రబాబు నాయుడు



**తిరుమల, సెప్టెంబరు 16 :** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

### తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## వాణిజ్య పంటలతో రైతులకు శాశ్వత ఆర్థిక భరోసా

### ఘనంగా 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్'



**ఏలూరు, సెప్టెంబరు 16 :** ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖలు అధ్వర్యంలో ఘనంగా 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్' కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని మొక్కలను నాటారు. అనంతరం రైతుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఫోటో ఎగ్జిబిషన్, సబ్సిడీపై అందిస్తున్న ఆధునిక యంత్రాలు స్టాల్స్ ను పరిశీలించారు. ఆయిల్ ఫామ్ లో మంచి ఫలితాలు సాధించిన ఉత్తమ రైతులకు జ్ఞాపికలు, శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు దీర్ఘకాలికంగా స్థిరమైన, అధిక నిఖర ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం మరియు దిగుబడిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని, మంచి శుభ పరిణామం అన్నారు. జిల్లాలో 52 వేలు మంది రైతులు 1 లక్షా 60 వేలు ఎకరాలు, నూజివీడు నియోజకవర్గంలో 8 వేలు మంది రైతులు 22,965 ఎకరాలు ఆయిల్ పామ్ సాగుచేస్తున్నారని, మరింత పెంచవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 1 ఒక హెక్టారుకు నాలుగు ఏళ్లలో రూ 71 వేలు కూటమి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నామని, జిల్లాలో 7 లక్షలు ఆయిల్ పామ్ మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ ప్రోత్సాహానికి, ఉద్యాన శాఖ, ఆయిల్ పామ్ కంపెనీలు ఏపి ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవిట్, నవభారత్, పతాంజలి కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో గడిచిన రెండు సంవత్సరాలలో 22,227 మంది రైతులకు 53,600 ఎకరాల్లో విస్తరించి రూ 34.24 కోట్ల రాయితీని మంజూరు చేశామని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అవసరమైన రాయితీలు, నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సహకారాన్ని అందిస్తోందని స్పష్టం చేశారు. రైతులు సంప్రదాయ పంటలు నుంచి వాణిజ్య పంటలు వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ గెలలు కొనుగోలుకు పటిష్టమైన యంత్రాంగం ఉందని, రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచే ఉత్పత్తి మొదలై 30 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఈ లోపు అంతర్ పంటలు వేసుకోవచ్చునని, వీటికి కూడా సబ్సిడీలు ఉన్నాయని రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్-చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా ఉద్యావన శాఖ అధికారి కె.షాజానాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యస్.కె.హాబీబ్ భాషా, ఆయిల్ పామ్ శాస్త్రవేత్త డా.కె.రామచంద్రుడు, రైతు నాయకులు, రైతులు, కౌలు రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు



**ఏలూరు, సెప్టెంబర్ 16 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ శ్రేణులు వివిధ స్థాయిల్లో పోటీలకు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం రామవరం మాజీ సర్పంచ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెట్టా ప్రసాద్ అధ్యక్షతన స్ఫూర్తి భవనంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అక్కినేని వనజ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చెప్పి నేటికీ అమలుకు నోచుకోలేదని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకి ఏడాదికి నాలుగు లక్షల చొప్పున ఐదు సంవత్సరాల కాలంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పిన విధంగా గడిచిన రెండు సంవత్సరాల కాలంలో 8 లక్షల మందికి ఉపాధి కల్పించవలసి ఉన్నప్పటికీ నిరుద్యోగ యువతకి ఎవరికీ ఉపాధి కల్పించలేదని వనజ తెలియజేశారు. ఉపాధి కల్పించలేని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ హామీ ఏమైందని వనజ ప్రభుత్వాన్ని విమర్శించారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు చొప్పున సహాయం అందిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలైనవని ఆమె పేర్కొన్నారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనార్టీలకు సంబంధించిన 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తానని చెప్పిన హామీలో ఒక్క ఎస్టీలకు మాత్రమే అమలు చేస్తూ మిగిలిన వారిని ప్రభుత్వం మోసం చేసిందని ఆమె అన్నారు. ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సిపిఐ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటం వలన పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందినట్లు ప్రజలకు తెలియజేయాలని సిపిఐ కార్యకర్తలకు ఆమె సూచించారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య గత సమావేశం నుండి నేటి సమావేశం వరకు జిల్లాలో పార్టీ నిర్వహించిన మరియు ప్రజా సంఘాలు నిర్వహించిన ముఖ్య కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ్య, ఉప్పులూరి హేమ శంకర్, నిమ్మగడ్డ నరసింహా, బాడిస రాము, కొన్నే లక్ష్మయ్య, రెడ్డి శ్రీనివాస్ డాంగే, తొర్లపాటి బాబు, వర్క శ్యామల తదితరులు పాల్గొన్నారు.



### వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక పూజలు

**ఏలూరు, సెప్టెంబర్ 16 :** వినాయక చవితి సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, ఎస్ఐలు సుధాకర్, నాగబాబు, ఏలూరు రూరల్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు స్వయంగా సిబ్బందికి భోజనాలు వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలపడింది. పండుగ వేళ అధికారులతో కలిసి ఆత్మీయంగా భోజనం చేయడం ఆనందంగా ఉందని సిబ్బంది పేర్కొన్నారు.

## రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాలి

### రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి.జయలక్ష్మి

**ఏలూరు, సెప్టెంబర్, 16 :** ఏలూరు జిల్లాలో సెప్టెంబర్ నెలలో 13 వేల 154 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ లక్ష్యానికి గాను, 13 వేల 124 పుస్తకాలు పంపిణీ చేశామని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, రెవిన్యూ సమస్యలు, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ అక్టోబర్ నెలకు గాను పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, 22ఏ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా నిబంధనల ననుసరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాల న్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ గౌడ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో జిల్లాలోని 32 గ్రామాలలో 13 వేల 154 పట్టాదార్ పాస్ పుస్తకాలకుగాను, 13 వేల 124 పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఏలూరు జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి సెప్టెంబర్ , 15 వ తేదీ వరకు 22ఏ భూ సమస్యలపై 446 దరఖాస్తులు అందగా వాటిలో 210 దరఖాస్తులు పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 193 దరఖాస్తులను కారణాలు తెలియజేస్తూ తిరస్కరించామన్నారు. పెండింగ్ లో ఉన్న 63 దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

### 17 నుండి 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం

**ఏలూరు, సెప్టెంబర్, 16 :** ఏలూరు జిల్లాలో ఈనెల 17 నుండి అక్టోబర్, 17 వరకు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం కింద వివిధ కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ కు చెప్పారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహణపై బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నెల రోజులపాటు ఒక సామజిక ఉద్యమంగా నిర్వహిం చాలన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమా లలో ప్రజలందరూ బాగస్వాముల య్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ఇంటికి వచ్చే చెత్త సేకరణ వాహనానికి తడి, పొడి చెత్తలను వేరుచేసి అందించేలా అవగాహన కలిగించాలన్నారు. అపారిశుద్ధ్యం కారణంగా వ్యాధుల వ్యాప్తి, అనారోగ్య పరిస్థితులపై ప్రజలను తెలియజేయాలన్నారు. ఏలూరు జిల్లా నుండి పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ ఏలూరు జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను మంత్రికి తెలియజేసారు.

# అడిడాస్ ఇండియాలో లేఆఫ్‌లు..

## సగం మందిపై ప్రభావం



ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ అడిడాస్ కూడా భారత్‌లో లేఆఫ్‌లు ప్రకటించింది. గురుగ్రామ్‌లోని టెక్ హబ్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులతోపాటు పలు విభాగాల ఇంజినీర్లను తొలగించేందుకు సిద్ధమైంది. లేఆఫ్ విషయాన్ని అడిడాస్ ధ్రువీకరించినప్పటికీ.. ఎంత మందిని తొలగిస్తోందనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. అయితే, దిల్లీ కార్యాలయంలో దాదాపు సగం మంది ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. వ్యాపార అవసరాలకు అనుగుణంగా నిర్వహణ పద్ధతులను మార్చే ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నట్లు అడిడాస్ పేర్కొంది. ఈ మార్పుల వేళ ప్రభావితమయ్యే ఉద్యోగులకు తగిన చేయూత అందిస్తామని ఓ ప్రకటనలో వెల్లడించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కొందరిని తక్షణమే తొలగించగా.. మరికొందరు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతారని చెప్పినట్లు సమాచారం. గురుగ్రామ్‌లోని అడిడాస్ టెక్ హబ్‌లో దాదాపు 700 మంది పనిచేస్తున్నట్లు అంచనా.




# కొచ్చి వేదికగా అక్టోబర్‌లో

# డబ్ల్యూపీఎల్ మెగా ఆక్షన్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది. రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది




ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.




## వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే

అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు.

# భారత్‌లోనే ఐపీఎల్ 2027 వేలం

గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి.




హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

# వెస్టిండీస్‌తో సిరీస్..

## హార్దిక్‌కు నో ప్లేస్.. ఆకిబ్ నబీకి చోటు

వెస్టిండీస్‌తో త్వరలో జరగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు భారత జట్టును ప్రకటించారు. వన్డే టీమ్‌లో హార్దిక్ పాండ్యకు చోటు దక్కలేదు. సెప్టెంబరు 27 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. అక్టోబర్ 6 నుంచి ఐదు టీ20ల సిరీస్ ఉంటుంది.

వన్డే టీమ్: శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

టీ20 టీమ్: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.




ఆసియా క్రీడల్లో అప్‌డేటెడ్ టీమ్: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబె, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ, యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్




# యూపీఐ ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ

దిల్లీ: యూపీఐ లావాదేవీలకు సంబంధించి పెద్ద వ్యాపారులకు ఎండీఆర్‌తో పాటు మరో భారం కూడా పడనుంది. రూ. 2,000కు మించి జరిపే యూపీఐ చెల్లింపులపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేటుపై వ్యాపారులు 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే వారు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను పొందడం ద్వారా మొత్తం పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చని పన్ను నిపుణులు చెబుతున్నారు. వ్యక్తులు రూ. 2వేలు పైబడి వ్యాపారులకు చేసే యూపీఐ చెల్లింపులపై అక్టోబర్ 15 నుంచి 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుంది. గరిష్ఠ పరిమితిని రూ. 300గా కేంద్రం నిర్ణయించింది. రైల్వే, టెలికాం, బీమా, పెట్రోల్ బంకుల్లో ఫ్లాట్ రేటు రూ. 5గా నిర్ణయించారు. ప్రతిపాదిత విధానం ప్రకారం చెల్లింపు సేవలు వినియోగించుకున్నందుకు గానూ ఎండీఆర్ భారాన్ని వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. దీనికి 18 శాతం జీఎస్టీ కూడా వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల ఏటా రూ. 3,500 నుంచి రూ. 4వేల కోట్ల ఆదాయం సమకూరనుందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ వెల్లడించారు. అయితే, ఈ రుసుములను భరించే నమోదిత వ్యాపారులు చెల్లించిన జీఎస్టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవడం ద్వారా పన్ను భారం తగ్గించుకోవచ్చని చెప్పారు. లావాదేవీ విలువతో సంబంధం లేకుండా 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటుపై మాత్రమే 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని మరో పన్ను నిపుణుడు శివకుమార్ రమ్జీ తెలిపారు. జీఎస్టీ పరిధిలో ఉన్న వారు ఐటీసీ ద్వారా మినహాయింపు ఈ భారం తగ్గించుకోవచ్చని, జీఎస్టీ వెలుపల ఉన్న వ్యాపారులు మాత్రం ఎండీఆర్ ఛార్జీలతో పాటు దానిపై జీఎస్టీ భారమూ భరించాల్సి ఉంటుందని తెలిపారు. యూపీఐపై ఛార్జీల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గే ఉద్దేశమేదీ లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక పునరాలోచన చేసే అవకాశమే లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు. యూపీఐని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఎండీఆర్ ఛార్జీల విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఎండీఆర్ ఛార్జీలపై విపక్ష పార్టీలు, ట్రేడర్ల నుంచి వ్యతిరేకత వస్తున్న వేళ ప్రభుత్వం నుంచి ఈ స్పందన వెలువడింది.




# లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశ ఫలితాలకు ముందు చమురు ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం.. మార్కెట్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు రాణించడంతో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 74,249.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,003.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజులో చాలా వరకు లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 74,505.86 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 332.63 పాయింట్ల లాభంతో 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.95గా ఉంది. సెన్సెక్స్ 30లో ఐటీసీ, ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 107.73 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,342.99 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




# సబ్‌స్క్రిప్షన్‌కు ముందు తగ్గిన ఎన్ఎస్ఈ ఐపీఓ జీఎంపీ

దేశంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ ఎన్నో అంచనాల మధ్య ప్రైమరీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. రూ. 22,562 కోట్ల మెగా ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 17న ప్రారంభమై.. సెప్టెంబర్ 21న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణి రూ.రూ. 1700-1785గా కంపెనీ నిర్ణయించింది. 12.64 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రిటైల్ ఇన్వెస్టర్లు 8 షేర్లు కలిగిన ఒక్కో లాట్ కొనుగోలుకు రూ. 14,280 వెచ్చించాల్సి ఉంటుంది. సుదీర్ఘ కాలయాపన తర్వాత దలాల్ స్ట్రీట్‌లోకి అడుగుపెడుతున్న ఎన్ఎస్ఈ ఐపీఓ గ్రే మార్కెట్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌కు ఒక్కరోజు ముందు క్షీణించింది. వారం క్రితం 12 శాతంగా ఉన్న ప్రీమియం.. ఐపీఓ ముందురోజు 9.4 శాతానికి పడిపోయింది. ఇష్యూ ధర కంటే గ్రే మార్కెట్ ప్రీమియం రూ. 200 అధికంగా ఉండగా.. అది రూ. 167కి తగ్గింది. దీంతో రూ. 1,952 వద్ద అరంగేట్రం చేయొచ్చని అంచనా వేస్తోంది. డెరివేటివ్స్ ట్రేడింగ్ వాల్యూమ్స్ తగ్గుతుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించడం వల్ల ప్రీమియం తగ్గిందని నిపుణులు చెబుతున్నారు.

జనం వార్త




## వేగం పెంచిన ‘ధర్మన్’

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. “ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను” అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే.

## ‘ది ప్యారడైజ్’కు సెన్సార్ పూర్తి..

నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. “శారీరకంగా, మానసికంగా ‘ది ప్యారడైజ్’ నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు” అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. “సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది” అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, “సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభ రితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది” అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, “‘పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతు కంతా దేశానిది’ అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే ‘ది ప్యారడైజ్’ కథ” అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.



### అనంత్ నాగ్‌కు ప్రతిష్ఠాత్మక

## దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

### ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్ఠాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రము-ఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలి పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ‘ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబ డిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భు తమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలో నూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళా కారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.’ అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ ‘సంకల్ప’తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ ‘మాల్గుడి డేస్’లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో ‘పద్మ భూషణ్’తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం ‘ఆదర్శకుటుంబం’. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న రిలీజ్ కాబోతున్నది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా వచ్చిన టీజర్‌తో సినిమాలో ఉన్న కామెడీ యాంగిల్‌ను పరిచయం చేశారు మేకర్స్. సాధారణ బ్యాంక్ ఎంప్లాయ్‌గా ఉండే వెంకీ.. తన భార్య అప్పుల బాధ తట్టుకోలేక విలవిల్లాడతాడు. అలాంటి వ్యక్తికి లాడరీ తగిలితే ఎలా ఉంటుంది అనే యాంగిల్‌కు కామెడీ జోడించి అద్భుతంగా ప్రజెంట్ చేశాడు

## స్పెషల్ సాంగ్‌లో డింపుల్..

త్రివిక్రమ్. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి తాజాగా మరో క్రేజీ అప్డేట్ నెట్టింట దర్శనమిచ్చింది. ఈ మూవీలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రాజెక్టులో క్రేజీ అండ్ బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతి కూడా భాగం అయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఈ మూవీలో ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉండబోతుండగా.. అందులో డింపుల్‌తో పాటు నివేథా పేతురాజ్ కూడా కనిపించనున్నారని తెలుస్తోంది. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





## ఎవరి ఒపీనియన్స్ వాళ్లవి

‘సిగ్మా’ ప్రమోషన్స్‌లో జోరు పెంచారు మేకర్స్. యంగ్ హీరో సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 2న రిలీజ్ కాబోతుండగా.. తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ‘బోనాల టైమ్‌లో వచ్చిన ట్రోల్స్‌తో మీరు చాలా ఇబ్బంది పడ్డారు.. అసలు సమస్య ఏంటి?’ అనే ప్రశ్నపై ఫరియా స్పందిస్తూ.. ‘ఈ ఇష్యూపై సోషల్ మీడియా ద్వారానే నా ఒపీనియన్‌ను కూడా నేను బయట పెట్టాను. నాకు సోషల్ మీడియా మీద పెద్ద ఒపీనియన్ లేదు. అది ఒక ఫ్లాట్‌ఫ్లామ్. ఎవరు ఎలా యూజ్ చేసుకుంటే అది అలాగే ఉంటది. కానీ, నాకు అనిపించింది ఏంటంటే.. ఇప్పుడు ఇది 2026వ సంవత్సరం. ఇంకా కొంతమంది మైండ్ సెట్ పాత కాలంలోనే ఉంది. మన పాత పద్ధతుల నుంచి కొన్ని ఒపీనియన్స్ తీసుకోవాలి. అయితే.. నా మైండ్ సెట్ వేరు. అలాగని నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే.. ఎవరి ఇష్టాలు వాళ్లని, ఎవరి ఒపీనియన్స్ వాళ్లవి’ అని తెలిపింది. కాగా.. ఇటీవల ఫరియా హైదరాబాద్‌లో జరిగిన బోనాల వేడుకల్లో చాలా యాక్టివ్‌గా పాల్గొంది. దానికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో.. ఆమె మతాన్ని ప్రస్తావిస్తూ కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో ఆమెను ‘కాఫీర్’ అంటూ తీవ్రంగా ట్రోల్ చేశారు. దీనిపై స్పందించిన ఫరియా ఎమోషనల్ వీడియో సైతం రిలీజ్ చేసింది.

### ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న

## విశ్వనాథ్ అండ్ సన్స్




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లీష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ ‘రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com